ముున్సిపాలిటీలో "మూడు" స్తంభాలాట

మూడు వర్గాలుగా మున్సిపల్ ఉద్యోగులు
అవిశ్వాస పైరవీలలో పాలకవర్గం
నాలుగు నెలలుగా జరగని సమావేశాలు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు సిబ్బందికి మధ్య ఇంకా సయోధ్య కుదర లేదన్న వార్త గట్టిగా వినబడుతోంది. విభాగ అధికారులతో సంబంధం లేకుండా అన్ని విభాగాల్లోనూ కమిషనర్ వ్యక్తిగతంగా తలదూర్చి వ్యవహరిస్తూ సంబంధిత అధికారులను విస్మరిస్తున్నారన్న విషయం ఆయా విభాగాల అధికారులకు మింగుడు పడడం లేదన్న సమాచారం సంబంధిత అధికారుల నోట వినిపిస్తున్న మాట. గతంలో ఈయన వ్యవహార శైలి నచ్చని కారణంగా కొంతమంది మహిళా ఉద్యోగులు మహిళా దినోత్సవం రోజున వ్యతిరేకించేం దుకు సిద్ధపడ్డారన్న విషయాన్ని ఇదే కార్యాలయంలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి గ్రహించి ఆ బాధ్యతను ఆయన భుజస్కందాలపై వేసుకొని కమిషనర్‌కు వత్తాసు పలుకుతూ వీరి నిరసనపై నీళ్ల చల్లి కొందరు ఉద్యోగులను కమిషనర్‌కు అనుకూలంగా మార్చి ఒక గ్రూపుగా తయారు చేశారన్న విషయం తెలియ వచ్చింది. దీంతో ఈ విషయాన్ని జీర్ణించుకోలేని మరి కొంతమంది మహిళా ఉద్యోగులు ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో ఒక గ్రూపుగా తయారయ్యారని, అదే విధంగా విభాగాలకు అధికారులు అయినప్పటికీ వీరి మాట సంబంధిత కమిషనర్ వద్ద చెల్లుబాటు కాకపోవటంతో విభాగ అధికారులు, ఆయా విభాగాల ఉద్యోగులు ఒక గ్రూపుగా ఏర్పడి చేసేది ఏమీ లేక వారి ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించుకుంటూ పోతున్నారు. ఏనాడు లేని విధంగా ఈ మున్సిపాలిటీలో ఉద్యోగుల మధ్య గ్రూపులు ఏర్పడడం ఇదే ప్రథమమని ఇలా జరిగితే ఉద్యోగాలు చేయడం కష్టమని కాలమే సమాధానం చెబుతుందని పలువురు అధికారులు నిట్టూరుస్తున్నారు. అంతేకాకుండా ఎమ్మెల్యే పేరు చెబుతూ ప్రతి పనికి కమిషనర్ కొర్రీ వేస్తున్నారన్న ఆరోపణలు కూడా సిబ్బంది నోట వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా పాలకవర్గం అవిశ్వాస బాటలో తిరుగుతూ గత నాలుగు నెలలుగా పాలకవర్గ సమావేశాలు ఏర్పాటు చేయకుండా అభివృద్ధిని గాలికి వదిలేసిందన్న వాదనలు పట్టణ ప్రజల్లో వినిపిస్తున్నాయి. ఏప్రిల్ నెల ముగుస్తున్నప్పటికీ బడ్జెట్ సమావేశం పురపాలక సంఘంలో జరగలేదంటే పట్టణ ప్రజల పట్ల మున్సిపల్ అధికారులకు, పాలకవర్గ సభ్యులకు ఎంతమేర అభివృద్ధి చేయాలన్న ఆలోచన ఉందో ఇట్టే అర్థమవు తుందని పలువురు విమర్శిస్తున్నారు. అలాగే మున్సిపాలిటీకి ఆదాయాన్ని తెచ్చిపెట్టే ఆశీల వేలంపాటను నిర్వహించి కౌన్సిల్ ఆమోదం గాని, చైర్ పర్సన్ ముందస్తు అనుమతి గాని లేకుండా ఆశీల వసూళ్లకు మున్సిపల్ కమిషనర్ మౌఖిక ఆదేశాలు జారీ చేశారని, నిరాశ్రయుల వసతి గృహ నిర్వహణకు పాలకవర్గం ఆమోదం తెలిపి దాదాపు నాలుగు నెలలు కావస్తున్నప్పటికీ సంబంధిత నిర్వాహకులకు మున్సిపల్ కమిషనర్ ఎందుకు బాధ్యతలు అప్పగించలేదని దీన్నిబట్టి చూస్తే సంబంధిత అధికారికి పాలకవర్గం పట్ల వారి ఆమోదాల పట్ల ఏమేర గౌరవం ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చని త్వరలో జరిగే పాలకవర్గ సమావేశంలో ఈ విషయాలపై నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నామని మున్సిపల్ చట్టంపై అవగాహన ఉన్న పలువురు పాలకవర్గ సభ్యులు వారి ఆవేదనను వ్యక్త పరుస్తున్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

విశాలాంధ్ర - సాలూరు: మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ గొల్లపల్లి పార్వతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలను సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు పంచాయతీ రాజ్ శాఖ కృషి చేస్తుందన్నారు. గ్రామస్థాయి పరిపాలన సక్రమంగా సాగించి గ్రామీణాభివృద్ధికి పంచాయతీ రాజ్ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ స్థానిక పాలన వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించడంలో పంచా యతీ రాజ్ వ్యవస్థ కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాములమ్మ, వైస్ ఎంపీపీలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతిలతో పాటు ఎంపిటిసిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్ గృహాలను పూర్తి చేయాలి

విశాలాంధ్ర - సీతంపేట: మండలంలో గృహ నిర్మాణ శాఖ పీడీ ఇన్‌చార్జ్ పి.ధర్మచంద్రారెడ్డి సీతంపేట మండలంలో గల వాబ, పెదరామ, మొగదార గూడ గ్రామాలలో ఉన్న పీఎం జన్‌మాన్ లబ్ధిదారులకు గృహ మంజూరు పత్రములను అందించారు. పిఎంఏవై గ్రామీణ్, పీఎం జన్‌మాన్ గృహ నిర్మాణ స్కీమునందు ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు నిర్మాణాలు వేగవంతం చేయాలని చెప్పారు. ఈ పర్యటనలో హౌసింగ్ పీడీ ఇన్‌ఛార్జ్ పి.ధర్మ చంద్ర రెడ్డి, హౌసింగ్ ఏఈ వెంకటేష్ పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతత చాలా అవసరం

విశాలాంధ్ర - గరుగుబిల్లి/పార్వతీపురం: చాలా రుగ్మతలకు కారణం మానసిక ప్రశాంతత లేకపోవటమేనని విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీరామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్నెస్ ట్రైనర్ జె.మురళీ అన్నారు. గురువారం తోటపల్లి గ్రామంలో ధ్యానకేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో మానవుడు చాలా రకాల కారణాలతో ప్రతీ చిన్న విషయానికి టెన్షన్ పడిపోతూ జబ్బుల బారిన పడుతున్నారని ఈ పరిస్థితి మారాలంటే జీవన విధానంలో మార్పులు రావాలన్నారు. ధ్యానం నిత్యజీవితంలో భాగం కావాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జట్టు స్వచ్ఛంద సంస్థ అధినేత డి.పారినాయుడు, అప్పలనాయుడు, శ్రీధర్ నాయుడు, సోమశేఖరరావు ప్రభృతులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన పంచాయతీ సిబ్బంది

విశాలాంధ్ర - కురుపాం: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ (సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల రాష్ట్ర సంఘం) గురువారం రాష్ట్రవ్యాప్తంగా మెగా ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చింది. అందులో భాగంగా కురుపాం మండలంలో ప్లాంటేషన్ కార్యక్రమాన్ని కురుపాం గ్రామపంచాయతీ ఆఫీస్‌లో, మండల ఇన్‌చార్జ్ ఇ.ఓం.పి.ఆర్.డి ఏగిరెడ్డి వెంకట్ నాయుడు, కురుపాం మేజర్ పంచాయతీ సర్పంచ్ గార్ల సుజాత, అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎస్ కార్తీక్, జిల్లా, మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మిగతా సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు.

బోగి హాసినిని అభినందించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - సీతానగరం: పదవ తరగతిలో నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని భోగి హాసిని 576 మార్కులు సాధించినందుకు పార్వతీపురం శాసనసభ్యులు బోనెల విజయ్ చంద్ర అభినందించారు. ఈ కార్యక్రమంలో సీతానగరం మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ సూరీడమ్మ, హెచ్ఎం బిదితి మనోజ్ కుమార్, మండల జనసేన అధ్యక్షులు పాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో పారదర్శకత పాటించాలి

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

విశాలాంధ్ర - పాచిపెంట: ప్రభుత్వ పథకాలు అమలులో అధికారులు పారదర్శకత వేగం పాటించాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పాచిపెంట మండలంలో అమలవుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని ఆమె మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందని, అందువల్ల అధికారులు ప్రతిష్టాత్మక పథకాల అమలులో పారదర్శకత, వేగం పాటించాలని సూచించారు. ముఖ్యంగా పల్లె ప్రగతి, హరిత హారం, సముదాయ శుభ్రత, నీటి సరఫరా, పింఛన్ల పంపిణీ, గృహ నిర్మాణాలు, విద్యుత్ సరఫరా, పాఠశాలల ఆధునీకరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అవసరాలను అధికారులు సమర్థవంతంగా పరిష్కరించే విధంగా వ్యవస్థను రూపొందిం చాల్సిన అవసరం ఉందని చెప్పారు. మండలంలో చేపట్టిన ప్రాధాన్యతా ప్రాజెక్టులపై సమయ పాలనతో కూడిన కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామం అభివృద్ధి పరంగా ముందుకు సాగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పాత్రో, తహశీల్దార్ రవి పాల్గొన్నారు.

27 నుంచి ఇసుక సరఫరా చేయాలి

కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలోని భామిని మండలం నేరడి, పాలకొండ మండలం చినమంగళాపురం ఇసుక రీచుల వద్ద ఈఅనెల 27వ తేదీ సోమవారం నుంచి ఇసుక సరఫరా కావాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇసుక సరఫరాకు సంబంధించి కలెక్టర్ అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వులు, మార్గదర్శకాలకు అనుగుణంగా ఇసుక సరఫరా జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇసుకను తరలించేందుకు వీలుగా స్టాక్ పాయింట్లను సిద్ధం చేసుకోవాలని, ఇందుకు స్థల సేకరణ చేయాలని ఆదేశించారు. ముందుగా కాలుష్య నియంత్రణ మండలి, నీటి పారుదల శాఖాధికారులు రీచ్‌లను తనిఖీ చేసి నివేదికలు అందించాలని అన్నారు. అలాగే ఇసుక అక్రమంగా తరలించకుండా ఉండేందుకు పటిష్ట నిఘాను ఏర్పాటు చేయాలని అన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, గట్టి పోలీసు బందోబస్తు, బారికేడ్లు, చెక్ పోస్టు, ఆన్‌లైన్ వే బిల్లు, రిజిష్టర్లు, రికార్డులు అన్నీ పక్కాగా ఉండాలని అన్నారు. శనివారం నాటికి మొత్తం ప్రక్రియ పూర్తిచేసి సోమవారం నుంచి ఇసుక సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి,జిల్లా గనులు, భూగర్భవనరుల శాఖాధికారి, పోలీస్, నీటి వనరులు, గ్రామీణ నీటి సరఫరా విభాగం, కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్లు, భామిని, పాలకొండ తహశీల్దారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీడిపిక్కల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

- ప్రభుత్వ విప్ జగదీశ్వరి

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: జీడి పిక్కల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని ఇరిడి గ్రామంలో వన్‌ధన్ వికాస కేంద్రం ద్వారా జీడిపిక్కల కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. వీడీవీకే సభ్యులు ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేయడం జరుగుతుందని, దీని మద్దతు ధర కేజీ 157 రూపాయలు అని తెలిపారు. ఈ అవకాశాన్ని జీడీ రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం రామ కృష్ణ, జనసేన సమన్వయకర్త, ఇరిడి ఎంపీటీసీ కద్రక మల్లేశ్వరరావు, వీడీవీకే సభ్యులు ఊర్వసి, నియోజకవర్గ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, నాయకులు వెంకట్రావు, కొండలరావు, బుజ్జేశ్వరరావు, చిన్న, లక్ష్మణరావు, అప్పలస్వామి పాల్గొన్నారు.

ప్రతి మహిళ వ్యాపారవేత్త కావాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్: ప్రతి మహిళ ఓ వ్యాపారవేత్తగా మారాలని, రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారిత కోసం ఎన్నో కార్యక్రమాలు రూపొందిస్తున్నాయని వాటిని అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ఆకాంక్షించారు. మండలంలోని డోకిశీల గ్రామంలో వెలుగు ఆధ్వర్యంలో జీడి పిక్కల కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వాలు ఎన్నో చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. మహిళలు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రతి స్త్రీ మూర్తి పారిశ్రామిక వేత్తలా మారాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి ఎం. సుధారాణితో పాటు వెలుగు ఏపిఎం బలగ సన్నిబాబు, తెదేపా నాయకులు గొట్టాపు వెంకటనాయుడు చంటిబాబు వెలుగు సీసీలు ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

అంత్యోదయ స్ఫూర్తితో ప్రభుత్వ పథకాలు అందించాలి

- 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్

విశాలాంధ్ర - అరకులోయ: ఆధునిక సమాజానికి దూరంగా మారుమూల గిరిజన తండాలలో నివసించే చిట్ట చివరి లబ్ధిదారుడి వరకు ప్రభుత్వ పథకాలు అందినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని 20 సూత్రాల ఆర్థిక ప్రణాళిక అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అన్నారు. అరకు నియోజకవర్గం అనంతగిరి మండలం పైనంపాడు, అరకులోయ మండలం కొత్త భల్లుగూడ పంచాయతీ పరిధిలోని సిమిలిగూడ గ్రామాల్లో జాతీయ పంచాయతీరాజ్ దివస్ సందర్భంగా జరిగిన గ్రామ సభలలో పాల్గొన్నారు. అలాగే ప్రధానమంత్రి జన్మాన్ పథక లబ్ధిదారులతో సమావేశం అయిన క్షేత్రస్థాయిలో పర్యటించి జన్మన్ పథకం ద్వారా నిర్మిస్తున్న గృహాలను పరిశీలించారు. గిరిజన విద్య మరియు గ్రామీణ అభివృద్ధి సంస్థ(ట్రైడ్స్) ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలను సామాన్యులకు చేరువ చేసే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజానికి దూరంగా జీవిస్తున్న గిరిజన తండాలు, గ్రామాల్లో ప్రజలకు మౌళిక కల్పనకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం, చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడిగా విన్నూత్న పథకాలను అమలు చేస్తున్నాయని, తద్వారా గిరిజనులకు మౌళిక వసతుల కల్పన, ప్రభుత్వ పథకాలు అందించడం వంటి కార్యక్రమాలు శరవేగంగా సాగుతున్నాయని, వాటిలో భాగస్వాములై ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకోవాలని లబ్ధిదారులకు పిలుపు నిచ్చారు. కాకరపాడు, ఎగువ సోనాభ, దిగువ సోనభ, కొంగుపుట్టు, దుర్గం, పల్లి మామిడి, గ్రామాల లబ్ధిదారులు చైర్మన్‌కు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రధానంగా పయనంపాడు కాకరపాడు గ్రామాల మధ్య రహదారి సరిగా లేనందువల్ల ఇటుక, ఇసుక సిమెంట్ వంటి ఇన్పుట్ తెచ్చుకోవడం చాలా కష్టంగా ఉందని, ప్రభుత్వ అధికారులు దృష్టికి తీసుకెళ్లి తమ ప్రాంతంలో రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయా గ్రామాల ప్రజలు కోరారు. సిమిలిగూడ గ్రామంలో పీఎం జన్మన్ ప్రభుత్వ మంజూరు పత్రాలను చైర్మన్ దినకర్ చేతులమీదుగా లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ తేజ, పైనంపాడు సర్పంచ్ సీదిరి చెల్లెమ్మ, ఎంపీటీసీ వంతల తమన్న, వార్డు సభ్యులు కె.గురుమూర్తి, మాజీ ఎంపీటీసీ సిహెచ్ బాబు రావు, ట్రైడ్స్ సంస్థ ప్రతినిధి రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కారం

జేసీ అభిషేక్ గౌడ

విశాలాంధ్ర - హుకుంపేట: గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె అభిషేక్ గౌడ స్పష్టం చేశారు. గురువారం ఆయన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలో గల గడికించ మండ సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామంలో ఇప్పటివరకు ఈ పంచాయతీలో రెండుసార్లు పర్యటించానని చెప్పారు. గ్రామానికి తాగు నీటి పథకం, డ్రైనేజీలు, సిసి రోడ్లు మంజూరు చేయడం జరిగిందని పనులు ఇంకా ప్రారంభిం చాల్సి ఉందని ఆయన తెలిపారు. పంచాయితీ పరిధిలో ఉన్న గ్రామాల సమస్యలను గుర్తించి గ్రామసభలో తీర్మానం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఈశ్వరమ్మ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్టెల్ సిగ్నల్ లేక ఇబ్బందులు

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి మండలం ఎ.దారకొండ పంచాయతీ గొల్లపల్లి గ్రామంలో గత వారం నుంచి ఎయిర్టెల్ సిగ్నల్ అందుబాటులో లేదు. దీని కారణంగా హౌసింగ్ సర్వే చేయడానికి చాలా ఇబ్బంది పడుతున్నామని, సిగ్నల్ లేక చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కాబట్టి వెంటనే ఫైబర్ నెక్షన్ పెట్టి అందుబాటులో తేవాలని ఏ.దారకొండ పంచాయతీ గ్రామస్తులు అందరూ కోరుకుంటున్నామన్నారు. మేము బ్యాలెన్స్ వేసుకొని చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఏదైనా జబ్బు వచ్చినప్పుడు ఎమర్జెన్సీ కావాలంటే ఫోన్ చేసుకోవడానికి సిగ్నల్ లేక చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కాబట్టి దయచేసి మాకు వెంటనే సిగ్నల్ అందుబాటులో తేవాలని ఏ దారకొండ సర్పంచ్ ముర్ల చంటిబాబు కోరారు.

ఘనంగా గంగాలమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

విశాలాంధ్ర - కొయ్యూరు: మండలంలోని జీడిపాలెం పంచాయతీ కాకరపాడు గ్రామంలో వెలిసిన గ్రామ దేవత శ్రీ గంగాలమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను గ్రామస్తులంతా భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గంగమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అర్చకులు డి శ్రీరామచంద్రమూర్తి శర్మ, రేవళ్ల శాంతి దుర్గమ్మ తల్లి ఆలయ ధర్మకర్త మూలపర్తి సూరిబాబు ఆధ్వర్యంలో అమ్మవారికి పాలాభిషేకం పంచామృతాభిషేకం, చందన పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్య అభిషేకాలను వేదమంత్రోచ్ఛారణల నడుమ గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. వివిధ రకాల పిండి వంటలు పళ్ళు ఫలహారాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. విగ్రహ దాతలైన వీరబాబు,శ్యామలాదేవి కుటుంబీ కులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు అమ్మవారికి సారే చీరలను సమర్పించారు.

పరిపాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకం

విశాలాంధ్ర - జీకే వీధి: గూడెం కొత్త వీధి మండలం రింతడా,జర్రెల, గాలికొండ, మొండిగెడ్డ పంచాయతీల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం సర్పంచ్ అధ్యక్షతగా జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. పలువురు సర్పంచులు మాట్లాడుతూ పంచాయితీ గ్రామ అభివృద్ధికి సంబంధించి పంచాయతీరాజ్ వ్యవస్థలో పంచాయతీ పరిధిలో ఉన్న ఓటర్లందరినీ కలిపి పంచాయతీ రాజ్ దినోత్సవం జరుపుకోవడం శుభ పరిణామం అన్నారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు పథకాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. పరిపాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పిస్తూ పంచాయతీరాజ్ సంస్థలు కీలకంగా వ్యవహరిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పోత్తూరు విష్ణు మూర్తి, జరెల సర్పంచ్ ఈరోజు నాగరాజు, రింతాడ సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి, ఉప సర్పంచ్ మడవల సోమేశ్ కుమార్, మొండిగడ్డ సర్పంచ్ ఆడవ ప్రియాంక, గాలికొండ సర్పంచ్ కాకూరి బొజ్జబాబు, పంచాయతీ సెక్రెటరీ అరుణ్ కుమార్, మహిళలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతర విజయవంతానికి సహకరించండి

విశాలాంధ్ర - చింతపల్లి: మన్యం ఆరాధ్య దైవం, చింతపల్లి గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతరకు ప్రతి ఒక్కరూ సహకరించి జయప్రదం చేయాలని ఎంపీపీ కోరాబు అనూష దేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ నేటి నుంచి (24 నుంచి 27 వరకు) ఆదివారం వరకు నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్న చింతపల్లి గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి జాతరకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోపీనాయక శారద, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు చిందాడ జయలక్ష్మి, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాలపై అవగాహన

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండలంలో 2025-26 ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా కన్వర్జెన్సీ మీటింగ్ ఏర్పాటు చేశామని పిఎంపిడిఎస్ నవ ధాన్యాలు విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించామని ఏపీ సిఎన్ఎఫ్ మండల కో ఆర్డినేటర్ ఆనంద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో గల జరేల బాబుసాల, జోలపుట్, సుజనకోట పంచాయతీ పరిధిలలో గ్రామ వివోల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. వేసవిలో పొడి దుక్కులో చల్లుకొనే విత్తన గుళికలు తయారు చేసే విధానం, తొలకరి జల్లులకు ముందు 30 రకాలతో పిఎండిఎస్ విధానాలపై వివరించారు. గంజాయి సాగుని పూర్తిగా నిర్మూలించాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాయకం భాగ్యవతి, గ్రామ వ్యవసాయ సహాయకులు బాబీ, గ్రామ పశు సంవర్ధక సహాయకులు రమేష్, ఎంపీఓ శ్రీను, వివోఏ వెంకటలక్ష్మి, ఐసిఆర్పిఎస్ రామకృష్ణ, రాజబాందు, భవాని, నాగమణి, గౌతం, రామారావు, జి.గురు, బొంజుబాబు, జగన్నాథం, భాస్కర్, అర్జున్, త్రినాధ్ రైతులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవులు మృతి

విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలోని పట్టం పంచాయతీ దాబవలస గ్రామానికి చెందిన కొన్నేడి లచ్చన్నకు చెందిన 3 ఆవులు, కొన్నేడి సింహాద్రికి చెందిన 2 ఆవులు పిడుగు పడి మరణించాయి. ఊరి పక్కన కొండపైన ఆవులు మేతకు తీసుకెళ్లి ఉండడంతో ఇటీవల గాలి వానతో కురిసిన భారీ వర్షానికి పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాయని బాధిత రైతులు పేర్కొన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఆవులు ఒక్కసారిగా మృతిచెందడంతో రైతులు కన్నీరు మునీరుగా విలపిస్తున్నారు. సుమారు 4 లక్షల రూపాయలు వరకు నష్టం కలిగిందని బాధితులు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పం దించి నష్ట పరిహారం అందించి మా కుటుంబాలను ఆదుకోవాలని వారి కోరారు.

గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేస్తాం: కలెక్టర్ దినేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: ప్రాధాన్యతా క్రమంలో గ్రామ పంచాయతీలకు మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ పేర్కొన్నారు. డి.గొందూరు గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం నిర్వహించిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత పంచాయతీ పథకంలో ఎంపికైన 15 గ్రామాల్లో డి. గొందూరు పంచాయతీ ఉందన్నారు. పంచాయితీ అవసరాలను గుర్తించి గ్రామ సభ లో తీర్మానం చేసి ప్రతిపాదనులు పంపిస్తే అవసరమైన మంజూరులు చేస్తామన్నారు. పంచాయతీ నిధులు, లైన్ డిపార్టుమెంటులో అందుబాటులో ఉన్న నిధులతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. మహిళలు పొందిన బ్యాంకు లింకేజీలు సద్వినియోగం చేసుకుని వ్యాపారాలు చేయాలన్నారు. అనంతరం ప్రధాన మంత్రి జన్ మన్ పథకంలో 15 మంది లబ్దిదారులకు గృహ మంజూరు పత్రాలను పంపిణీ చేసారు. ఒక్కొక్క ఇంటికి ప్రభుత్వం రూ.2.39 లక్షల నిధులు విడుదల చేస్తోందన్నారు. లబ్దిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేయాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు మినుములూరులో గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి వి.ఎస్.కుమార్, గృహ నిర్మాణ శాఖ ఇ ఇ బి. బాబు, ఈ ఓ పి ఆర్ డి రమేష్, నీతి ఆయోగ్ బృందం చైతన్య రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ సర్పంచ్ సీదరి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన డీఈ

విశాలాంధ్ర - రంపచోడవరం: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం పురస్కరించుకొని రంపచోడవరం పంచాయతీ రాజ్ కార్యాలయంలో డీఈ వెంకటరమణ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ చెట్లను సంరక్షించాలని, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ఇవి మనకు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఇంజనీర్ అసిస్టెంట్‌లు సమీర్, చందు, రామకృష్ణ, సన్నీ, రవి, తేజ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో స్థానిక ఎన్నికలలో 100% విజయం సాధించాలి

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

విశాలాంధ్ర - పాచిపెంట: స్థానిక సంస్థల ఎన్నికల్లో వంద శాతం విజయం సాధించాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలో గల కొత్తవలస, మిర్తి వలస గ్రామాల సమీపంలో గల పామాయిల్ తోటలో గురువారం పార్టీ కార్యకర్తలతో, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వస్తున్న మంత్రి సంధ్యా రాణికి మిర్తివలస, కొత్తవలస గ్రామస్తులు ఘన స్వాగతం పలికి హారతులు ఇచ్చి అడుగడుగున పూల వర్షం కురిపించడంతో మంత్ర ఆనందానికి అవధులు లేవు. మంత్రి మాట్లాడుతూ పార్టీ పరిపాలనలో పార్టీలకతీతంగా కులమత బేధాలు లేకుండా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని అన్నారు. ప్రతి కార్యకర్త సమిష్టి కృషితో పనిచేసి స్థానిక ఎన్నికలలో శత శాతం గెలిపించుకోవాలని కోరారు. సాలూరు నియోజక వర్గంలో అన్ని గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అన్నారు. మునుపెన్నడు లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు సాగుతున్నాయని అన్నారు. ప్రతి మారుమూల గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించిన ఘనత చంద్రబాబు నాయుడుదేనిని అన్నారు. ప్రతి ఒక్కరూ సమిష్టి కృషితో పనిచేసి స్థానిక ఎన్నికలలో టీడీపీ సత్తా చూపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పార్టీ మండల కార్యదర్శి పాంచాలి సర్పంచ్ గూడెపు యుగంధర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖి సూర్యనారాయణలు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి స్థానిక ఎన్నికలలో టీడీపీ సత్తా చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ పి.ఈశ్వరరావు, స్థానిక ఎంపీటీసీ పల్లేడ ఉమామహేశ్వరరావు, ఉప సర్పంచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

గ్రామీణ డాక్ సేవక్‌గా సుబ్బారావు సేవలు అభినందనీయం

పోస్టల్ శాఖ ఏఎస్పీ మురళి

విశాలాంధ్ర - సీతానగరం: సీతానగరం మండల కేంద్రంలోని సబ్ పోస్టు ఆఫీసు పరిధిలో 32ఏళ్లు ఏకధాటిగా గ్రామీణ డాక్ సేవక్‌గా/ డెలివరీ ఏజెంట్‌గా/మెయిల్ బ్యాగ్ తీసుకువచ్చి, తీసుకుని వెళ్లే వ్యక్తిగా కాశీ సుబ్బారావు అందించిన సేవలు ఎంతో అభినందనీయమని పార్వతీపురం పోస్టల్ శాఖ ఏఎస్పీ మురళి కొనియాడారు. గురువారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఇటీవల పదవీ విరమణ చేసిన గ్రామీణ డాక్ సేవక్ కాశీ సుబ్బారావు నాగమణి దంపతులను పోస్టల్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, సీతానగరం గ్రామ పెద్దలు, యూనియన్ నాయకులు, కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్వతీపురం పోస్టల్ శాఖ ఏఎస్పి మురళి, బొబ్బిలి సబ్ డివిజన్ ఐపిఓ శ్రీనివాసరావులు హాజరై సుబ్బారావు సేవలను కొనియాడారు. పోస్టల్ శాఖలో చిరుద్యోగిగా పనిచేసిన సుబ్బారావు అందరిచేత మంచి వ్యక్తిగా పిలవబడటం ఎంతో గర్వకారణమన్నారు. ప్రతీ ఉద్యోగి సేవలు సక్రమంగా అందించినప్పుడు సుబ్బారావువలే గుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీతానగరం సబ్ పోస్ట్ ఎస్ పిఎం చిన్ని, స్వామి నాయుడు, యూనియన్ నాయకులు వేణు, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు, ఈడిఎంసిలు, రిటైర్డ్ బిపిఎంలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. వారితోపాటు కుటుంబ సభ్యులు, వివిధశాఖల అధికారులు డాక్టరు దీనకుమార్, ప్రసాద్, సూరిదేముడు, కుమార్ వర్మ, సీతానగరం మండల కేంద్రానికి చెందిన ప్రముఖులు సాలా హరిగోపాలరావు, అరవింద్, మమ్ముల విశ్వేశ్వరరావు, అరిశెట్టి సత్యనారాయణ, కూర్మదాసు శ్రీనివాసరావు, ఈర్ల సూర్యనారాయణ, సుంకరి అప్పారావు, మరిసి వెంకన్న, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మోహన్, శ్రీనివాస శర్మ, వేదపండితులు సీతారామ సత్యనారాయణ వెంకటరమణ, కాశీసుఖేష్, కుటుంబ సభ్యులు కాశీ ఈశ్వర సుబ్రహ్మణ్యం, పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. సన్మాన గ్రహీత సుబ్బారావు దంపతులను ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీత సుబ్బారావు మాట్లాడుతూ తనకు దక్కిన సత్కారం ఎంతో గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహించానని అందరితో మంచిగా ఉంటూ ఉద్యోగ ధర్మాన్ని నిర్వహించి అందరికీ మెరుగైన సేవలు అందించినట్లు తెలిపారు.

జిల్లా ఆసుపత్రిలో నేత్ర శస్త్ర చికిత్సలు పునః ప్రారంభం

విశాలాంధ్ర - బెలగాం: గత మూడు నెలలుగా సదరం సర్టిఫికెట్ పరిశీలన సందర్భంగా నిలిపివేసిన నేత్ర శస్త్ర చికిత్సలు మరల ప్రారంభించారు. పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో అత్యుత్తమ నేత్ర వైద్య సేవలు అందుబాటులో ఉన్నట్లు ఈ నేత్ర వైద్య చికిత్సలు వినియో గించుకొని కంటి చూపును కాపాడుకోవాలని ఆసుపత్రి ఆర్ఎంఓ, నేత్ర వైద్య విభాగాధిపతి డాక్టర్ శ్యామల కోరారు. గ్రామాలలో నిర్వహిస్తున్న నేత్ర వైద్య శిబిరాలలో నేత్ర పరీక్షలు చేసి కేటరాక్ట్ (అంతర కుసుమం) టేరిజియం (కొయ్యకండ) గుర్తించిన వారికి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నేత్ర వైద్య విభాగంలో రోజు వారి నేత్ర పరీక్షలలో శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించిన వారికి ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నేత్ర శస్త్ర చికిత్స నిపుణులు డా. వెంకటేష్ నిర్వహిస్తున్నట్లు మన్యం జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు. వీరందరికీ ఉచిత వసతి, భోజనం, కళ్ళజోళ్ళు, మందులు సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. శస్త్ర చికిత్సలు పూర్తయి ఇంటికి వెళుతున్న రోగులకు ఆసుపత్రి నేత్ర వైద్య అధికారి శ్రీనివాసరావు పలు సూచనలు, జాగ్రతలు వివరిస్తూ కంటి రోగుల పట్ల అత్యంత శ్రద్ధ వహిస్తున్నారు. జిల్లా ఆసుపత్రిలో పేదలకు కంటి చూపు తెప్పించే బాధ్యతను తీసుకొని అన్ని సదుపా యాలు కల్పిస్తున్న జిల్లా అంధత్వ నివారణ సంస్థకు రోగులు ధన్యవాదాలు తెలిపారు.

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - మోతుగూడెం: చింతూరు మండలం గూడూరు పంచాయతీలోని దబ్బగూడెం గ్రామంలో గురువారం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. విగ్రహ దాతలైన ఏపీ జెన్‌కో ఏడీఈ దొడ్డ కొండబాబు దంపతుల చేతుల మీదుగా పొల్లూరు దుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయ కమిటీ, అర్చకులు కుమారస్వామి శర్మ ఆధ్వర్యంలో ఈ ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్టలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

పది ఫలితాల్లో సాయి భువనకృతి ప్రతిభ

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం బెలగాంకు చెందిన వాకుడవాత్ చిన్న కోటానాయక్, సరస్వతి భాయి కుమార్తె సాయి భువన కృతి పదవ తరగతి పరీక్షలలో 600 మార్కులు గాను 594 మార్కులు సాధించి పార్వతీపురం పట్టణానికి 2వ ర్యాంక్ సాధించింది. ఈమె పార్వతీపురం నారాయణ స్కూల్‌లో చదువుకుంది. మంచి మార్కులు రావడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. స్కూల్ ఉపాధ్యాయులు అభినందించారు.

పశువులకు రేడియం స్టిక్కర్లు వేయండి

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం హైవే నిర్మాణం వలన రోడ్డుకి ఆనుకుని ఉన్న గ్రామాల పశువులు రాత్రులు రోడ్డుమీదే ఉండటంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. పశువులు రోడ్డుకి అడ్డంగా పడుకోవడం వలన వారంలో కనీసం మూడు, నాలుగు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహన చోదకులు రాత్రిపూట పశువులను ఢీకొట్టడం వలన తీవ్రగాయాల పాలవుతున్నాయి. ఇది గమనించి రాజవొమ్మంగి వెటర్నరీ డాక్టర్ తరుణ్ రాజ్ ఆదేశాల మేరకు సిబ్బంది తంటికొండ గ్రామంలో హైవే ప్రక్కన గ్రామాల రైతులకు ప్రమాదాల కొరకు అవగాహన కల్పించి వాటికి రేడియం స్టిక్కర్స్ గాని పెయింట్ గాని వేయాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ,బాలు, పశుసంవర్ధక శాఖ సహాయకులు కిషోర్, ఆశ వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, రైతులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డోకిశీల విద్యార్థుల ప్రతిభ
ఎల్ఎన్ పురం విద్యార్థినికి మొదటి స్థానం

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్: మండలంలోని డోకిశీల జిడబ్ల్యుఎఎస్ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరచి ఆదర్శంగా నిలిచారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 47 గురు విద్యార్థులు హాజరు కాగా ఇందులో 42 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో జిల్లేడువలస గ్రామానికి చెందిన తాడంగి సంతోష్ 507 మార్కులను సాధించి వసతి గృహానికి మంచి పేరు తీసుకొచ్చారు. దీంతో హెచ్ఎంతో పాటు వార్డెన్, ఉపాధ్యాయులు సంతోష్‌ను అభినందించారు. దీంతోపాటు మండలంలోని పెదబొండ పల్లి, తాళ్లబురిడి, ములగ ఉన్నత పాఠశాలల విద్యార్థులు కూడా పరీక్ష ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచారు. ఆయా విద్యార్థులకు హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు. మండలంలోని ఎల్ఎన్ పురం గ్రామానికి చెందిన తుంబలి చికిర్ష మంచి మార్కులు సాధించింది. పట్టణంలో గల టిఆర్ఎంఎం ఉన్నత పాఠశాలలో చదువుతుంది. 600 గాను 591 మార్కులు సాధించింది. తల్లిదండ్రులు శివాజీ, శివకుమారి ఇద్దరు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

విశాలాంధ్ర - చింతపల్లి: భారతదేశంలో ప్రతి ఏటా ఏప్రిల్ 24ను జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవంగా నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో యుఎస్‌వి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎంపీపీ కోరాబు అనూష దేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్యలు విచ్చేశారు. ఈ సందర్భంగా పంచాయితీ రాజ్ వ్యవస్థను పటిష్టం చేయడం కోసం కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ దినోత్సవాన్ని గురువారం ప్రతి పంచాయతీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ 1992లో భారత రాజ్యాంగం 73వ చట్ట సవరణ జరిగిందన్నారు. ఈ సవరణ ద్వారా గ్రామ, జిల్లా స్థాయిలలో గ్రామ పంచాయతీల ద్వారా పంచాయితీ రాజ్ వ్యవస్థ ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోపి నాయక శారద, ఎంపీటీసీలు, మండల కో ఆప్షన్ సభ్యున్ని ఈ సందర్భంగా స్థానిక మండల విద్యాశాఖ అధికారి పనసల ప్రసాద్‌తో కలిసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండలంలోని చొక్కనపల్లి గ్రామానికి చెందిన తోడం రాంబాబు, నాగమణి ఇల్లు ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో వాళ్ళ ఇంట్లో ఉన్న వస్తువులు అంతా పూర్తిగా కాలి బూడిద అవడంతో ఎంతో నష్టపోయి పూర్తి నిరాశ్రయులుగా ఉన్న కుటుంబానికి స్థానిక సర్పంచ్ పులి సంతోష్ కుమార్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు సున్నం రాజులు, యూటీఎఫ్ సభ్యులు పూసం రామారావు చేతుల మీదుగా బియ్యం, నిత్యావసర సరకులు, గిన్నెలు, 2000/-రూపాయలు వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి యన్.జగదీష్, కార్యదర్శులు యన్.రామకృష్ణ, యం.బాబు, జె.వెంకటరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీతో గిరిజన అభ్యర్థులకు తీవ్ర నష్టం

విశాలాంధ్ర - బెలగాం : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డిఎస్సీతో గిరిజన ఉపాధ్యాయ అభ్యర్థులకు తీవ్ర నష్టం జరగనుందని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ అన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లా పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో మొత్తం 137 పోస్టులు చూపిస్తే గిరిజనులకు కేవలం 10 పోస్టులు మాత్రమే రిజర్వు చేసారని, అలాగే ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐటిడిఎ పరిధిలో మొత్తం 85 పోస్టులు చూపిస్తే 6 పోస్టులు మాత్రమే గిరిజనులకు రిజర్వు చేసారని, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా, పాడేరు ఐటిడిఎ పరిధిలో మొత్తం 400 పోస్టులు చూపిస్తే 25 పోస్టులు మాత్రమే గిరిజనులకు రిజర్వు చేసారని ఇంతకన్నా అన్యాయం మరొకటి లేదని రంజిత్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేసారు. ముఖ్యమంత్రి ఎన్నికల ముందు గిరిజన పోస్టులు గిరిజనులకు ఇస్తామని జీవో నెంబర్ 3 లేదా ఆ తరహా మరో జీఓ ఇస్తామని చెప్పి ఇలా మోసం చేయడం ఏమిటని ప్రశ్నించారు. మరో వైపు గిరిజన గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయ పోస్టులు డిఎస్సీలో కలపం అని వారికి గిరిజన మంత్రి సమ్మె సమయంలో హామీ ఇచ్చి ఇప్పుడు ఆ పోస్టులు డిఎస్సీలో చూపించారని ఇక్కడ అత్యధికులు గిరిజన ఉపాధ్యాయులే ఉన్నారన్నారు. ఈ రకంగా ఈ డిఎస్సీ వల్ల గిరిజన నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు ఇప్పటికే ఇక్కడ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసే గిరిజన ఉపాధ్యాయులకు ఇది అన్యాయం చేసే డిఎస్సీ అని రంజిత్ విమర్శించారు.

పెహల్గాంలో ఉగ్రదాడిని ఖండించండి

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: జమ్మూ కాశ్మీర్ పహెల్గాంలో జరిగిన ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ అన్నారు. గురువారం రేకపల్లి ప్రధాన రహదారి కూడలిలో జమ్మూ కాశ్మీర్లో జరిగినటువంటి ఉగ్ర దాడిని నిరసిస్తూ అక్కడ వీరమరణం పొందినటువంటి వారికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ లోని పర్యాటక అందాలను ఆస్వాదించడానికి వచ్చినటువంటి అమాయక పర్యాటకులపై ముష్కరులు దాడి చేయడం పిరికిపంద చర్య అని అమాయకుల ప్రాణాలు బలి కొనడం సరైనది కాదని ఉగ్రవాదులపై భారత ప్రభుత్వం తప్పకుండా ఉక్కు పాదం మోపుతుందని ఆ ఉగ్రవాద కాల్పుల్లో మరణించిన కుటుంబాలకు తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని మరణించిన కుటుంబ సభ్యులు కుటుంబానికి ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ కారం లక్ష్మి , జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు. మండల కమిటీ సభ్యులు పోడియం శ్రీరామ్ మూర్తి, వంక్కు సత్తిబాబు గుండుపూడి లక్ష్మణరావు ,కారం సుందరయ్య, చీరపు తాతబాబు, పీసా కమిటీ అధ్యక్ష కార్యదర్శి వెటకాని సూరి, సారా పాండురాజు, కమ్మసిచ్చి సత్యనారాయణ పంకు చందు, ఆత్మకూరి కాంతారావు, వీర్ల నాగేశ్వరరావు, నాళ్ళారపు ప్రకాశరావు, గూటాల శివ, కుంజా కన్నయ్య, సోడే మల్లయ్య, అజరత్, రేఖపల్లి యూత్ తదితరులు పాల్గొన్నారు.

20 లీటర్ల నాటుసారాతో వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర - కురుపాం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో నవోదయం 2.0లో భాగంగా దాడులు నిర్వహించి కురుపాంలో 20 లీటర్ల నాటుసారాతో రాయిపల్లి ప్రవీణ్ కుమార్ (27) అనే వ్యక్తిని కోర్ట్‌కు రిమాండ్ నిమిత్తం హాజరుపరచినట్లు ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాస్ ప్రకటించారు. ఎ2గా రాయపల్లి అప్పారావు (45), ఎస్సీ వీధి, కురు పాంకి చెందిన సరఫరాదారుడిని అరెస్టు చేయాలన్నారు. ఈ దాడులలో ఎస్.ఐలుళ, జె.రాజశేఖర్, చంద్ర కాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

9న బహిరంగ వేలం

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పురపాలక సంఘమునకు సంబంధించి పురపాలక సంఘం ఆధీనంలో యున్న ఐ.డి.యస్. యమ్.టి. రూములలో ప్రస్తుతం ఖాళీగా యున్న షాపు నెం.22,32, 34,35, 44,46, 48 షాపు రూములను గుత్త నిబంధనల ప్రకారము గుత్తకు ఇచ్చుటకు మే 9వ తేదీన పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించబడునని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆశక్తి గల వారు సదరు బహిరంగ వేలంలో పాల్గొనాలని పూర్తి వివరముల నిమిత్తము కార్యాలయము పని గంటలలో రెవెన్యూ సెక్షనులో సంప్రదించాలని, పైన తెలిపిన షాపులకు కేటగిరీలు వారీగా రెండేసి సాల్వెన్సీలు సంబంధిత వేలం తేదీకి 3 రోజులు ముందుగా తీసుకొని రెవెన్యూ సెక్షనులో దాఖలు పరిచి వేలంలో పాల్గొనాలని కోరారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: కూటమి ప్రభుత్వ హయాంలోనే మన్యం అభివృద్ధి సాధ్యపడుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అన్నారు. గురువారం మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఉర్లకులపాడులో లబ్ధిదారులకు గృహ మంజూరు పత్రాలను అందజేశారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నామని, రానున్న కాలంలో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పెద్దిరాజు, టిడిపి నాయకులు తాతారావు, లోతా లక్ష్మణరావు, తహసీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపిడిఓ యాదగిరేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలి

విశాలాంధ్ర - సీతానగరం: డిసెంబర్ 1, 2023 నుండి అక్టోబర్ 31,2024లోపు ఎవ్వరయినా పెన్షనర్ (ఇంటి యజమాని) చనిపోయి ఉంటే భార్యకు స్పౌజ్ పెన్షన్‌కి అప్లై చేసుకోవచ్చునని ఎంపీడీవో త్రివిక్రమరావు తెలిపారు. మరిన్ని వివరాలకు దగ్గరున్న గ్రామ సచివాలయంలోనూ, గ్రామపంచాయతీ కార్యాలయంలోనూ, మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా ప్రారంభమైన ముత్యాలమ్మ జాతర

విశాలాంధ్ర - చింతపల్లి: తరతరాలుగా తమ ఇంటిలో కొలువుదీరిన శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతరను ప్రతి ఏటా గంధమావాస్యలో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని సుర్ల వంశస్థుడు ముత్యాలమ్మ అమ్మవారి పూజారి సుర్ల అప్పారావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ తరతరాలుగా సుర్ల వంశస్తుల గృహంలో కొలువై ఉన్న చింతపల్లి గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా ప్రతి ఏటా గంధమావాస్యను పురస్కరించుకొని నాలుగు రోజులపాటు ఈ జాతరను నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే క్రమంలో ఈ ఏడాది కి సంబంధించి గురువారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్న ఈ జాతరకు సంబంధించి శుక్రవారం సాయంత్రం సాడి పేటలో ఉన్న తమ స్వగృహం నుంచి అమ్మవారి పాదాలు, గరగలను శుక్రవారం సాయంత్రం గ్రామంలోని శతకం పట్టు వద్దకు తప్పేట మోతలతో ఊరేగింపుగా తీసుకొని వచ్చి కొలువు చేయడం జరుగుతుందన్నారు. మరుసటి రోజు గ్రామంలోని పురవీధులలో ఊరేగించి తమ ఇంటి వద్దకు చేర్చడం జరుగుతుందన్నారు. ఆఖరు రోజైన ఆదివారం వేలాది సంఖ్యలో తరలివచ్చిన భక్తుల ను ఆశీర్వదించేందుకు అమ్మవారి ఘటాలు, గరగలను ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, గ్రామస్తులు, భక్తుల ఆనందోత్సాహాల మధ్య అత్యంత వైభవోపేతంగా గ్రామంలో ఊరేగిస్తూ మరుసటి రోజు తెల్లవారుజామున ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం చెంతకు చేర్చడం, భక్తులు ముత్యాలమ్మ అమ్మవారికి మొక్కులు తీర్చుకోవడంతో అమ్మవారి జాతర ముగుస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు మాదల తిరుపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి మార్గదర్శకంగా ఉండాలి

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయానికి మార్గదర్శకంగా మారడానికి వ్యవసాయ అనుబంధ సంస్థలతో కన్వర్జెన్స్ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు మండల స్థాయిలో ఏఓ ప్రసాదరావు సమావేశాన్ని నిర్వహించారు. ఏపీఎం రామకృష్ణ మాట్లాడుతూ ఏ విఓలో అయినా అర్హత లేకపోయినా పక్కనున్న విఓ ద్వారా అప్పు ఇవ్వటం జరుగు తుందని, నవధాన్యాలు కొను గోలుకు పెట్టుబడిగా ఉపయోగించుకొని, రైతులకు అందు బాటులో వుంచి అమ్మిన తరవాత తిరిగి చెల్లించవచ్చని వివరించారు. ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింపజేయడానికి ప్రతి శాఖ కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని, రైతులకు శిక్షణ, సమావేశాలు, విత్తనాలు సరఫరా, ఉపాధి హామీ పథకం, మొదలగు శాఖల సహకారం అవసరమని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, ఎంఎంటిఎల్ గణేష్ శరత్, ఎంటి నరసింహ, ఏంటి నిర్మల, కమ్యూనికేషన్ నీరజ, హెచ్ఎన్ఎస్ఎఫ్ఎఫ్ ప్రసన్న జ్యోతి ఏపిసిఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు అందుబాటులో శ్రీలక్ష్మీ నరసింహస్వామి జలప్రసాదం

విశాలాంధ్ర - సీతానగరం: మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ప్రతీ గురువారం పెద్దఎత్తున తరలివస్తున్న వేలాదిమంది భక్తుల దాహార్తిని తీర్చేందుకు భక్తులు, ఆలయ ధర్మకర్త దంపతులు కలిసి ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి జలప్రసాదం అందుబాటులోకి వచ్చినట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు రామానుజాచార్యులు తెలిపారు. వేసవి దృష్ట్యా భక్తులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం పట్ల అందరూ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు ప్రతీ గురువారం మిట్ట మధ్యాహ్నం వేళ భక్తులకు మజ్జిగ కూడా అందజేస్తున్నారు. వేసవి ఎండల దృష్ట్యా ఆలయం వద్ద ప్రదక్షిణ చేసే ప్రదేశాల్లో పెద్ద ఎత్తున రేకు షెడ్ లను కూడా ఏర్పాటు చేశారు. ఎండలు పెద్దఎత్తున పెరిగినప్పటికీ భక్తుల రాకమాత్రం తగ్గకపోవడంతో శ్రీలక్ష్మీనరసింహ స్వామి అనుగ్రహం, చల్లదనం భక్తులపై ఉందని పలువురు భక్తులు తెలియజేయడం గమనార్హం. భగవంతుని అనుగ్రహంతో ముడుపుల పూజలను దిగ్విజయంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పోలీసుల ఆధ్వర్యంలో రహదారి మరమ్మతు పనులు

విశాలాంధ్ర జీకే వీధి: గూడెం అద్దెర వీధిలో రోడ్డు కోతకు గురైన గుంతని వాహనాలకు ప్రమాదం పొంచి ఉందని ఉద్దేశంతో జీకే వీధి పోలీసులు ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో మట్టి తీసుకొచ్చి మట్టితో పూడ్చి మరమ్మత్తులు చేపట్టడం జరిగిందిని జీకే వీధి సర్కిల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్ తెలిపారు.గూడెం కొత్త వీధి మండల కేంద్రం నుండి ఆఫ్ కిలోమీటర్ దూరంలో అందరివీధిలో అంతర్రాష్ట్ర రహదారి తారు రోడ్డు కోత గురి కావడంతో వాహనాలకు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రాత్రి వేళలో టు వీలర్ పెద్ద వాహనాలు వేగంగా వచ్చిన కోత గురైన రోడ్డు కనిపించక ప్రమాదాలు జరగొచ్చుని గుంతలు మట్టితో పూడ్చి మరమ్మతులు చేపట్టడం జరిగిందని ఆయన అన్నారు.

ఉగ్రవాద దాడులకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర - చింతూరు: జమ్మూ కాశ్మీర్లో అమాయకులైన పర్యాటకులపై ఉగ్రవాదుల పాసివిక దాడిని నిరసిస్తూ చింతూరు డివిజన్ కేంద్రంలో చింతూరు యువత ఆధ్వర్యంలో ఉగ్రవాద దాడులకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రజాప్రతినిధులు అన్ని పార్టీల రాజకీయ నాయకులు, ముస్లిం పెద్దలు, యువత క్రైస్తవ సోదరులు పెద్ద ఎత్తున చింతూరు యూత్ సభ్యులు వచ్చి నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు చేతబట్టి చింతూరు గాంధీ సెంటర్ నుండి లారీ ఆఫీస్ మీదుగా ప్రధాన కూడలి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఉగ్రవాదులపై నిరసన నినాదాలు చేస్తూ చింతూరు యువత, ఉగ్రవాదుల దాడి ఘటనను తీవ్రంగా ఖండించారు.

ఉత్తమ ఉపాధి హామీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా రామచంద్రరావు

విశాలాంధ్ర - పార్వతీపురం: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం అమరావతిలో పలువురు అధికారులను ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. పార్వతీపురం మన్యం జిల్లా నుండి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పెద్ద ఎత్తున సేవలను జిల్లాల్లో అందించిన జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కె. రామచంద్రరావును ఉత్తమఅధికారిగా ఎంపికచేసి గురువారంనాడు పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా సన్మానించి మెమొంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి స్వచ్ఛభారత్ అధికారులతోపాటు రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయిలో అవార్డును పొందిన పిడి రామచంద్రరావుకు జిల్లా కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్, జిల్లాలోని పలువురుఅధికారులు, ఉపాధి హామీపథకం జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు, ఎంపీడీవోలు, పలువురు ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

ఉగ్రదాడిలో మృతులకు ఘన నివాళి

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: పహల్గామలో జరిగిన ఉగ్ర దాడిలో ప్రాణలు కోల్పోయిన పర్యాటకులకు నివాళులర్పిస్తూ గుమ్మలక్ష్మీపురంలో గల గాంధీ విగ్రహం నుండి ఎల్విన్ పేట కూడలి వరకు గురువారం సాయంత్రం 5:00 గంటలకు కొవ్వొత్తుల ర్యాలీ చేసి అలాగే ఎల్విన్ పేట కూడలిలో మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొనడం జరిగింది. పెద్ద సంఖ్యలో ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారి తప్పనిసరి చేయించుకోవాలి

పాడేరు సబ్ యూనిట్ అధికారి ధనుంజయ్

విశాలాంధ్ర - పాడేరు: ప్రతి ఇంటిలో తప్పనిసరిగా దోమల మందు పిచికారి చేయించుకోవాలని పాడేరు సబ్ యూనిట్ అధికారి బి.ధనుంజయ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కుమ్మరి పుట్టు, కుమ్మరి పుట్టు కోలని గ్రామాలు, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మలేరియా నివారణ ఏ.సి.యం 5శాతం మందును పిచికారి చేయడం జరిగిందన్నారు. పాడేరు మండలం పరిధిలో మలేరియా ఉధృతిని నివారించుట కొరకు మొదటి రౌండ్ పిచికారి కార్యక్రమం ద్వారా 89 గ్రామాలను అధికారులు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 12 గ్రామాలలో ఉన్న 833 గృహాలలోని 1,734 గదులలో మలేరియా నివారణ ఏ.సి.యం 5శాతం మందును ఇంటి లోపల పిచికారి చేయడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మలేరియా నివారణ ఏ.సి.యం 5శాతం మందును అన్ని గదులలో అధికారుల సహకారంతో పిచికారి చేయడం జరిగిందన్నారు. ఎపిడమిక్ సీజన్ వస్తున్నందున, వాతావరణంలో మార్పుల వలన మలేరియా, డెంగ్యూ, సాధారణ జ్వరాలు ప్రభలే అవకాశం ఉన్నందున జ్వర లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి వైద్యాధికారిని సంప్రదించి చికిత్సలు చేసుకోవాలని లేదా సంబందిత వైద్య సిబ్బందిని సంప్రదించి రక్త పరీక్షలు చేసుకోవాలన్నారు. మలేరియా నిర్ధారణ అయినట్లయితే వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఏ.సి.టి, ప్రైమాక్విన్ మందులను వాడాలన్నారు. పూర్తి స్థాయిలో ఏ.సి.యం 5శాతం మందును పిచికారి జరుపుట కొరకు రెవెన్యూ శాఖ, గ్రామ సచివాలయ శాఖ, వెలుగు, అంగన్వాడీ, మలేరియా శాఖ, వైద్య సిబ్బంది సమన్వయంతో అవగాహన కలిపించి పిచికారి చేయడం జరుగుతుందన్నారు. దోమతెరల వినియోగంపై గ్రామ స్థాయిలో అవగాహన కలిపించాలని వైద్య సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గుల్లేలి సింహాద్రి, హెల్త్ అసిస్టెంట్ నాగరాజు, యం.టి.యస్ కె.ప్రసాద్, మలేరియా సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాలు
మహిళ మృతి, ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు

విశాలాంధ్ర - సీతానగరం: లచ్చయ్యపేట షుగర్ ఫ్యాక్టరీకి దగ్గరలో రాష్ట్రీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా, యువకునికి గాయాలు తగిలాయి. పోలీసులు అందించిన వివరాల ప్రకారం బొబ్బిలి నుంచి సీతానగరం తమ స్కూటీపై వస్తున్న పట్నాయకుని అనిల్ కుమార్, అతని భార్య శ్రీదేవిలను వారి వెనుక వస్తున్నటువంటి ఒక బొలెరో వాహనం సదరు స్కూటీని వెనకనుంచి ఢీకొట్టడం జరిగింది. దీనిలో స్కూటీపై ప్రయాణిస్తున్న భార్యాభర్తలు కూడా రోడ్డుపై పడిపోగా భర్తకు చిన్నచిన్న దెబ్బలు తగలుగా, భార్య తలకు తీవ్రగాయం అవడంతో ఇరువురిని 108 వాహనంలో బొబ్బిలి సిహెచ్సి కు తరలించారు.ఆసుపత్రికి తీసుకువెళ్లే సమయంలో పట్నాయకుని శ్రీదేవి మృతి చెందినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. ఆమెభర్త అనిల్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలాఉండగా గురువారం సాయంత్రం లచ్చయ్యపేట-కింతలివానిపేట గ్రామాల మధ్యలో చక్కెర కర్మాగారానికి దగ్గరలో రాష్ట్రీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొబ్బిలి పురపాలక సంఘంలో పనిచేస్తున్న ఉద్యోగికి తీవ్ర గాయాలయ్యాయి. విధులు పూర్తిచేసుకుని స్వగ్రామం పార్వతీపురం వైకేఎం కాలనీవైపు వస్తున్న యువకుడిని ఎదురుగా వస్తున్న బొలెరో వ్యాన్ ఢీకొనగా బలమైన గాయాలు తగిలాయి. స్థానికులు క్షతగాత్రుడుని బొబ్బిలి ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడైన ఆదిమూలం రవికిరణ్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ రిఫర్ చేశారు.ఎస్ఐ రాజేష్ బొబ్బిలి ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యుల నుండి ఫిర్యాదు తీసుకున్నారు. రెండు కేసులను నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. రాష్ట్రీయ రహదారిలో గురువారం నాడు రెండు రోడ్డు ప్రమాదాలు ఒకే చోట జరగడం, ఒకరు మృతి చెందడం, ఇద్దరికి గాయాలు తగలడంచూసి రోడ్డు ప్రమాదాలు నివారణ పై అధికారి యంత్రాంగం దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఉగ్ర దాడికి నిరసనగా వైసిపి శాంతియుత ర్యాలీ

విశాలాంధ్ర - అరకులోయ: మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం అరకు నియోజకవర్గం శాసనసభ్యులు రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో వైసిపి శ్రేణులతో అరకులోయలో గల నాలుగు రోడ్ల జంక్షన్‌లో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా అరకు శాసనసభ్యులు మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులు పహల్గన్ సరిహద్దుల్లో భారతదేశానికి చెందిన పౌరులు సుమారుగా 28 మంది పర్యటకులను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపారన్నారు. దానికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనను జరగకుండా ఉండాలని దేశ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హెూంమంత్రి అమిత్ షాను కోరుతున్నట్టు తెలిపారు. ఉగ్రవాదులకు సంబంధించిన సంస్థలను, స్థావరలను అణిచివేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కమిడి అశోక్, శెట్టి అప్పాలు, పాంగి చిన్నారావు, ఎల్ బి కిరణ్ కుమార్, గుడివాడ ప్రకాష్ రావు, పెట్టేలి సుంకర, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

చెల్లంనాయుడు వలసలో కొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర - సీతానగరం: కాశ్మీర్లో టెర్రరిస్టులు చేతిలో అమరులైన 28 మంది అమాయక పౌరుల ఆత్మకు శాంతి కలగాలని, వీరమరణం పొందిన వీరులుగా వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ సర్పంచ్‌తో పాటు పిల్లలు, మహిళలు, పెద్దలు కాండిల్ ర్యాలీని చెల్లంనాయుడువలసలో నిర్వహించారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఘనంగా ముడుపుల పూజలు

విశాలాంధ్ర - సీతానగరం: మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం జరిగిన ముడుపుల పూజలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలను భక్తి శ్రద్ధలతో చేశారు. ఆలయ ప్రధానఅర్చకులు పీసపాటిశ్రీనివాసాచార్యులు,పీసపాటి రామానుజాచార్యులు టిటిడి పారాయణ కర్త కె .శ్రీనివాసరావులఆధ్వర్యంలో ఈపూజలను నిర్వహించారు. ఎడతెరపి లేకుండా ఎండలు కాస్తున్న భక్తులు స్వామివారి చల్లని ఆశీస్సులతో పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. భక్తులుతెచ్చినపూలతో స్వామివారిని అలంకరించిన తీరు భక్తులను ఆకట్టుకుంది. కొబ్బరికాయలు అరటిపల్లు,కుంకుమ, పసుపుతో స్వామివారి ప్రధానగుడి భక్తులతో కళకళలాడింది. ప్రతీ గురువారం శ్రీలక్ష్మి నరసింహస్వామీ దేవాలయంలో జరుగుతున్న ఈ ముడుపుల పూజలకు పాత భక్తులతోపాటుకొత్త భక్తులురాకతో ఆలయం

కిటకిటలాడింది. నిర్మలమైన మనస్సుతో భక్తులు 27సార్లు ఆలయంచుట్టూ ముడుపులు పట్టుకొని ఓంశ్రీలక్ష్మి నరసింహస్వామి అంటూ ప్రదక్షిణలనుచేస్తూ స్వామివారికి పూజలు చేస్తున్నారు.తీర్థప్రసాదాలు స్వీకరించి తరలి వెళ్తున్నారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి తోపాటు శ్రీవేణుగోపాలస్వామిని భక్తులు దర్శించుకుంటారు.గురువారం జరిగిన ముడుపుల పూజలకు ఆలయధర్మకర్త చెలికాని వెంకటగోపాలకృష్ణ భారతిదంపతులు, ముడుపుల పూజలో పాల్గొన్నారు. ఆలయ ప్రధానఅర్చకులతో పాటు పవన్ ఆచార్యులు, మురారి, మనోజ్ ఆచార్యులు ,కృష్ణమోహన్ ఆచార్యులు, రఘురాం దగ్గరుండి పూజలు చేయించడంతోపాటు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసారు. భక్తులకు మంచినీటి సౌకర్యంతో పాటు మజ్జిగ సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నారు. పెద్ద ఎత్తున ఎండలు ఉన్న భక్తులు లెక్క చేయకపోవడం గమనార్హం.

పత్తిమందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర - బెలగాం : పత్తి మందు తాగి వ్యక్తి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వైకేఎం కాలనీకి చెందిన వెలగాల శ్రీనివాసరెడ్డి అప్పులు చేసి ఎప్పటికప్పుడు తాగుతుండడంతో భార్య సావిత్రి మందలిస్తూ ఉండేది. అదేక్రమంలో బుధవారం రాత్రి కూడా తాగి రావడంతో మందలించింది. దీనితో మనస్తాపం చెంది గురువారం తెల్లవారు జామున పత్తి మందు తాగి ఆత్మహత్యానికి పాల్పడ్డాడు. కొత్తసమయం తరువాత వాంతులు చేసుకోవడంతో పత్తిమందు వాసన రావడంతో భార్య సావిత్రి గమనించి 108 ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకొని రాగా వైద్యులు చికిత్స అందించారు. ప్రాథమిక చికిత్స తీసుకొని స్థానిక కర్షక మహర్షి ఆసుపత్రికి తీసుకొని వెళ్లిపోయారు. జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు ఎఎస్ఐ నిమ్మకాయల భాస్కరరావు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

కొట్లాటలో వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర - బెలగాం : కొట్లాటలో వ్యక్తికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మునిసిపల్ కొత్తవలసకు చెందిన సాలాపు ప్రభ ఆటో డ్రైవర్. తన కుమార్తె రజస్వల వేడుకలను తన కన్నవారింటిలో చేయాలని భార్య శిరీష కుమార్తెను తీసుకొని పుట్టింటికి వెళ్ళిపోయింది. ఇద్దరి మధ్య అభిప్రాయ బేధాలు వచ్చాయి. ప్రభ అత్తవారింటికి వెళ్ళి పిలవగా బావమరిది పొట్నూరు వాసు, అత్త చిన్నమ్మ, భార్య శిరీష దాడి చేసి రాయితో కొట్టారు. దీనితో ప్రభకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన ప్రభ స్నేహితుడు తులసి ప్రభను పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకొని రాగా వైద్యులు చికిత్స అందించారు. ప్రభ వికలాంగుడు. జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు ఎఎస్ఐ నిమ్మకాయల భాస్కరరావు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉపాధి హామీలో కోల్డ్ వార్....?

ఏపీఓ తీరుపై విసుగు..... సెలవుపై వెళ్ళిపోయిన ఈసి....!

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్ : ఉపాధి హామీ పథకంలో మండల స్థాయిలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు, క్రింది స్థాయి సిబ్బందికి మధ్య కోల్డ్ వార్ నడుస్తుంది. ప్రధానంగా ఏపిఓగా విధులు నిర్వహిస్తున్న కృష్ణారావు తీరు నచ్చక క్రింది స్థాయి సిబ్బందితో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు, టిఏలు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. సక్రమంగా సిబ్బందితో పనులు చేయించుకోవలసిన ఏపిఓ క్రింది స్థాయి సిబ్బందికి అసభ్యకర పదజాలం ఉపయోగిస్తూ నచ్చిన విధంగా చిత్రహింసలకు గురి చేస్తున్నారని పలువురు బాహాటంగా ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఎక్కడికక్కడ ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పనుల్లో పురోగతి ప్రదర్శించాలని ఉన్నత అధికారుల నుంచి ఒత్తిడి సహజంగా ప్రతి ఏడాది మాదిరిగానే ఉంటుందన్నది అందరికీ తెలిసిన సత్యం. ఉన్నతాధికారుల ఆదేశాలను ఏపిఓ కృష్ణారావు అదేదో తనమీద భారం పడిపోయినట్లు భావించే క్రింది స్థాయి సిబ్బందితో పాటు టిఏలు ఎఫ్ఏ లపై చిందులేస్తూ అందరిపై అసభ్యకర పదజాలం ఉపయోగిస్తున్నారు. ఈ అసభ్యకర పదజాలాన్ని భరించలేక ఇటీవల ఈసిగా విధులు నిర్వహిస్తున్న సోమేశ్వరరావు వ్యక్తిగత సెలవుపై వెళ్ళిపోయారంటే ఏపిఓ సిబ్బందిని ఎన్ని విధాలుగా చిత్రహింసలకు గురి చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. దీంతో చేసేదేమీ లేక సీతానగరం మండలంలో విధులు నిర్వహిస్తున్న ఈసి ని డిప్యూటేషన్ పై పార్వతీపురం మండలానికి తీసుకువచ్చారు. మరోవైపు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలగి ఏపిఓ సిబ్బందిపై కూడా పరోక్షంగా కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని మరికొందరి ప్రధాన ఆరోపణ. ప్రభుత్వాలు మారుతున్నప్పుడు అధికారులపై నాయకుల ఒత్తిళ్లు సహజంగా ఉంటాయి. క్రింది స్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఎఫ్ఏ లపై కొందరు రాజకీయ నాయకులు వ్యక్తిగత కక్షలతో ఫిర్యాదులు చేయడం సహజం. అటువంటి వాటిపై నిజానిజాలు తెలియకుండా క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండా రాజకీయ నాయకుల ముందే సహ సిబ్బందిపై ఏపిఓ దురుసుగా మాట్లాడటం గతంలో అనేక సందర్భాల్లో బయటపడ్డాయి. కొందరు టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు ఏపిఓ కృష్ణారావు కార్యాలయంలో ఉంటే కనీసం విధులు నిర్వహించుకునేందుకు కార్యాలయానికి రావడానికి కూడా భయపడుతున్నారని తెలుస్తుంది. ఏ నిమిషం ఎవరిపై దుర్భాషలా డుతారో...? ఎవరిపై ఆగ్రహంతో చిందులేస్తూ ఊగిపోతారో తెలియక మహిళ ఎఫ్ఎలు సిగ్గుతో కార్యాలయం మొహం చూడలేకపోతున్నారు. క్రింది స్థాయి సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి ముమ్మరంగా పనులు జరిగేలా చూడాల్సిన ఏపిఓ కృష్ణారావు ఈ విధంగా కోపోద్రేకాలకు లోనై అందరి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేయడం విచారకరం. ఏదేమైనా ఏపిఓ కృష్ణారావు తీరుపై సంబంధిత ఎంపిడిఓ గాని, పథకం ఉన్నతాధికారులు గాని చర్యలు తీసుకోకపోతే రానున్న రోజుల్లో పథకం అమలులో పురోగతి, లక్ష్యసాధన కన్నా సహ ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత తప్పదనే చెప్పాలి.